
విధుల్లో చేరిన ‘భగీరథ’ కార్మికులు

కూసుమంచి: ‘మిషన్ భగీరథ’ కార్మికులు శుక్రవారం విధుల్లో చేరారు. అంతకుముందు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌ఛార్జి దయాకర్‌రెడ్డి సమక్షంలో మిషన్ భగీరథ ఎస్ఈ సదాశివకుమార్, ఎల్‌అండ్‌టీ ప్రాజెక్టు మేనేజర్ ఎల్‌కే రెడ్డి, కార్మిక సంఘాల బాధ్యులు చర్చలు జరిపారు. తక్షణం ఒకనెల వేతనంతోపాటు, కొద్దిరోజుల్లోనే పెండింగ్ వేతనాలు చెల్లిస్తామనే హామీ మేరకు సమ్మె విరమించినట్లు కార్మిక సంఘం నాయకుడు పుల్లారెడ్డి తెలిపారు.





నేడు దసరా మహోత్సవాలు



ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: అశ్వయుజ శుద్ధ దశమి రోజు చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా విజయ దశమి(దసరా)ని శనివారం జరుపుకొనేందుకు జిల్లా ప్రజలు సన్నద్ధమయ్యారు. దసరా రోజున ప్రజలు తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించి మామిడి, అరటి ఆకులతో ఇళ్లను అందంగా అలంకరించుకుంటారు. ఖమ్మం నగరంలోని దేవాలయాలు దసరా వేడుకలను ముస్తాబయ్యాయి. శ్రీస్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం, గుట్టలబజారులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి, రోటరీనగర్‌లోని శ్రీరాజరాజేశ్వరి దేవాలయాలతో పాటు శ్రీలక్ష్మీనర్సింహస్వామి పారువేట స్థలం(జమ్మిబండ)లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. జమ్మిబండ వద్ద భక్తుల దర్శనానికి క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. స్వామివారి ఊరేగింపు అనంతరం భక్తులు దర్శించుకునేందుకు ప్రత్యేక వేదిక, పాలపిట్ట దర్శనం, జమ్మి చెట్టును సిద్ధంగా ఉంచారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పర్యవేక్షణలో జరిగే నరకాసురుడి దహనానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు తెలిపారు.

ఈనాడు ఖమ్మం

శనివారం అక్టోబరు 12, 2024

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా సమీకృత గురుకులాలు: భట్టి

బోనకల్లు, న్యూస్‌టుడే: సమీకృత గురుకులాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. లక్ష్మీపురంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు శుక్రవారం భూమిపూజ చేశారు. సాయుధ పోరులో ప్రముఖ పాత్ర పోషించిన లక్ష్మీపురం పరిసర వాసులకు అంతర్జాతీయ స్థాయి విద్యనందించాలనే లక్ష్యంతో పాఠశాల ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సమీకృత గురుకుల పాఠశాలల రూపకల్పనలో అధిక పాత్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కదేనని ఎంపీ రఘురాంరెడ్డి, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. డిప్యూటీ సీఎంను ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు, సంఘం బాధ్యులు సన్మానించారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిశోర్‌కుమార్, ఉమ్మనేని రమేశ్ సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకుడు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎంపీడీవో రవికుమార్, తహసీల్దార్ పున్నంచందర్, ఎంఈవోలు పుల్లయ్య, వెంకటేశ్వర్లు, ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట: మంత్రి తుమ్మల

రఘునాథపాలెం: సమాజంలో అత్యంత ప్రాధాన్య అంశం చదువేనని, అందుకే విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్‌తో కలిసి రఘునాథపాలెంలో సమీకృత గురుకుల పాఠశాలకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వానికి భారమైనా విద్యార్థుల సంక్షేమానికి రూ.5వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రఘునాథపాలెం వద్ద అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన స్వామినారాయణ ట్రస్టు పాఠశాల ఏర్పాటవుతోందని పేర్కొన్నారు. త్వరలోనే ఈ ప్రాంతంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో కృష్ణుడి మందిరం, కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. రఘునాథపాలెం మండలంలో బుగ్గవాగు కాల్వ పూర్తి చేసేందుకు రైతులు భూములిస్తే ఒక్క ఏడాదిలో సాగు నీరందిస్తామని తెలిపారు. లేదంటే వీవీపాలెం వద్ద ఎత్తిపోతల పథకంతో సాగునీరు అందిస్తామన్నారు. గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహ్రా, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మానుకొండ రాధాకిశోర్, కమర్తపు మురళీ, మలీదు వెంకటేశ్వర్లు, మలీదు జగన్, తాతా రఘురాం, డీఈఓ సోమశేఖరశర్మ పాల్గొన్నారు. పుఠాణితండా, బూడిదంపాడు, సూర్యాతండాలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలకు మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు.

కుల, మత భావన పోగొట్టేందుకే: మంత్రి పొంగులేటి

ఖమ్మం గ్రామీణం: ‘గత పాలకులు కులాలు, మతాల వారీగా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో కుల, మత భావన పోగొట్టేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం సమీకృత గురుకులాలను ప్రారంభిస్తుంది’ అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం గ్రామీణ మండలం పొన్నెకల్లులో సమీకృత గురుకులానికి శంకుస్థాపన చేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులతోపాటు నిరుద్యోగులకు డీఎస్సీ ద్వారా పదివేల ఉద్యోగాలు ఇచ్చినట్లు గుర్తుచేశారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ సమీకృత గురుకులాల్లో 3వేల మందికి చదువుకునే అవకాశం ఉందని తెలిపారు. ఎంపీ రఘురాంరెడ్డి, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీఈఓ సోమశేఖరశర్మ, తహసీల్దారు రాంప్రసాద్, ఎంఈఓ శ్రీనివాస్, మద్దులపల్లి మార్కెట్ ఛైర్మన్ హరినాథబాబు పాల్గొన్నారు.




లక్ష్మీపురంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సన్మానిస్తున్న ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సైదులు, తదితరులు



రఘునాథపాలెంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, వేదికపై కలెక్టర్, సీపీ, రాయల తదితరులు



ఖమ్మం గ్రామీణం: పొన్నెకల్లులో ప్రసంగిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





ఓటు నమోదుపై ఉపాధ్యాయుల్లో నిర్లిప్తత

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే



ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటు నమోదు ప్రక్రియ నత్తకు నడక నేర్పినట్లుగా సాగుతోంది. ఈ స్థానంలో ఓటు నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఎమ్మెల్సీ స్థానంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతిసారీ కొత్తగా ఓటు నమోదు చేస్తారు. గతంలో ఉపయోగించిన ఓటరు జాబితా పరిగణనలోకి తీసుకోరు. గతంలో ఓట్లు వేసినవారైనా తాజాగా ఓటు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఉపాధ్యాయుల ఓటు నమోదుకు నవంబర్ 6 వరకు గడువు ఉంది. ఖమ్మం జిల్లాలో ఈనెల 11 వరకు కేవలం 18 దరఖాస్తులు మాత్రమే అధికారులకు ఆన్‌లైన్‌లో అందాయి. ఓటు నమోదుపై ఉపాధ్యాయుల్లో నెలకొన్న నిర్లిప్తతపై అధికారులు ఆశ్చర్యపోతున్నారు. ఇప్పటికే కలెక్టర్, అదనపు కలెక్టర్ పలుమార్లు సమావేశాలు నిర్వహించి ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. అయినా జిల్లాలో అర్హులైన ఉపాధ్యాయులు ఓటు నమోదుకు ముందుకు రాకపోవటం వెనుక ఆంతర్యమేమిటో బోధపడటం లేదు. 2019లో ఎన్నికలు నిర్వహించినపుడు జిల్లాలో 2,318 మంది పురుషులు, 1,316 మంది మహిళలు ఓటర్లుగా నమోదయ్యారు. తాజాగా ఈ సంఖ్య పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తుండగా ఓటు నమోదుకు మాత్రం దరఖాస్తులు రావటం లేదు.

★ కల్లూరు, కామేపల్లి, కొణిజర్ల, సింగరేణి, తల్లాడ మండలాల నుంచి ఒకటి చొప్పున 5, మధిర 2, సత్తుపల్లి 2, ఖమ్మం రూరల్ 3, ఖమ్మం అర్బన్ మండలంలో 6.. మొత్తమ్మీద 18 దరఖాస్తులు మాత్రమే ఆన్‌లైన్‌లో అధికారులకు అందాయి. ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్‌నాయక్‌ను ‘న్యూస్‌టుడే’ సంప్రదించగా అర్హులైన ఉపాధ్యాయులు నవంబర్ 6 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల ప్రిన్సిపల్స్, హెచ్‌ఎంలు సహా విద్యాశాఖ అధికారులకు ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించామని తెలిపారు.

మిగతా జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి..


ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలో 12 జిల్లాలు ఉండగా పది జిల్లాల నుంచి ఓటు నమోదు దరఖాస్తులు 142 అందాయి. నల్గొండ-38, సూర్యాపేట-22, యాదాద్రి భువనగిరి-8, జనగామ-4, మహబూబాబాద్-8, వరంగల్-11, హనుమకొండ-24, భద్రాద్రి కొత్తగూడెం-6, ఖమ్మం-18, ములుగు జిల్లా నుంచి మూడు దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట జిల్లాల నుంచి ఒక్క దరఖాస్తూ రాకపోవటం గమనార్హం.





టీఎస్ బీపాస్‌లో సాంకేతిక చిక్కులు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: జిల్లాలో పుర, నగరపాలికల్లో 20 రోజులుగా భవన నిర్మాణ అనుమతుల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. టీఎస్ బీపాస్ ద్వారా అనుమతులు తీసుకునేందుకు దరఖాస్తు చేసుకుంటుండగా ప్రస్తుతం దరఖాస్తుదారు అప్‌లోడ్ చేసిన పత్రాలేవీ వెబ్‌సైట్‌లో కనిపించటం లేదు. తద్వారా అనమతులు ఇచ్చేందుకు అవకాశం లేకుండా పోయింది. దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లో నిర్మాణ అనుమతులు ఇవ్వాల్సి ఉండగా, ప్రస్తుతం ఆ అవకాశం లేకపోవటంతో దరఖాస్తుదారులు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రణాళిక విభాగం అధికారులు వారికి సమాధానం చెప్పే పరిస్థితి లేకుండా పోయింది. వరుస సెలవుల నేపథ్యంలో మరికొంత కాలం దరఖాస్తుదారులు నిరీక్షించాల్సిందే. ఖమ్మం నగరపాలక సంస్థ ప్రణాళిక విభాగంలో డిప్యుటేషన్‌పై సిబ్బందిని నియమించినా సాంకేతిక సమస్యల కారణంగా అనుమతుల జారీలో జాప్యం తప్పటం లేదు. జిల్లాలోని మిగతా పురపాలికల్లోనూ ఇదే పరిస్థితి నెలకొనటంతో వందలాది మంది దరఖాస్తుదారులు అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులను ‘న్యూస్‌టుడే’ సంప్రదించగా.. అప్‌లోడ్ చేసిన పత్రాలు డౌన్‌లోడ్ కావడం లేదని, సోమవారం నాటికి సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.





విజయానికి ప్రతీక.. దసరా

నవరాత్రులు జగన్మాతకు పూజలు | **ప్రత్యేక ఆకర్షణగా జమ్మి చెట్టు, నరకాసుర వధ**

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా(విజయ దశమి) పండుగను జరుపుకొంటారు. ఖమ్మం నగరంలోని శ్రీస్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి పారువేట స్థలం, గుట్టలబజారు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఏటా పది రోజుల పాటు విజయదశమి ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తారు.

పారువేట స్థలం.. చరిత్రకు సాక్ష్యం

ఖమ్మంలో ప్రాచీన కొండపై శ్రీలక్ష్మీనర్సింహస్వామి స్వయంభువుగా వెలిశారని ప్రసిద్ధి. ఏడాదిలో ఒక పర్యాయం మాత్రమే దసరా పండుగ రోజున జనావాసంలోకి వస్తారు. శమీ పూజ కోసం స్వామివారు కొండ దిగి పారువేట స్థలమైన జమ్మిబండ వద్దకు చేరుకొని పూజ చేశారని భక్తుల నమ్మకం. పూర్వం జమ్మిబండ ఊరు బయట అడవి ఉండేది. పారు అంటే ఊరు దాటడం. జమ్మిబండ ప్రాశస్త్యం కాపాడుతూ ఏటా స్వామివారిని



జమ్మిబండ పారువేట స్థలం

ఊరేగింపుగా మేళతాళాలు, భజంత్రీల నడుమ తీసుకొచ్చి పారువేటను వైభవోపేతంగా జరుపుతారు. అక్కడ శమీ పూజ, నరకాసుర వధ చేస్తారు. స్వామివారి శమీ పత్రాలను భక్తులు తీసుకొని జమ్మి చెట్టుకు కట్టి వచ్చే ఏడాది దసరా వరకు తమకు ఎలాంటి ఆపదలు కలగకుండా రక్షించమని వేడుకుంటారు. 200ఏళ్ల క్రితం కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు శ్రీస్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొని గుట్టపై వెలిసిన స్వామివారికి ఆలయంతో పాటు పారువేట స్థల మండపాన్ని నిర్మించారు. కాలక్రమేణా పారువేట స్థలంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు జరుగుతూ వస్తున్నాయి. లకారం చెరువులో స్వామివారి



గుట్టలబజారులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం

తెప్పోత్సవం జరిగేది. రోజూ జమ్మిబండతో పాటు శ్రీలక్ష్మీనర్సింహస్వామి గుట్టపై అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. విజయదశమి రోజున జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రముఖుల సమక్షంలో లోక కల్యాణార్థం, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ స్వామివారికి వేదమంత్రోచ్ఛారణల నడుమ శమీ పూజ జరిపి అక్షింతలను భక్తులకు పంపిణీ చేస్తారు.

రోజుకో అవతారంలో వాసవీమాత అమ్మవారు

గత 48 ఏళ్లుగా ఖమ్మం గుట్టలబజారులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో విజయదశమి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు పార్వతీదేవి అంశతో వైశ్య కులంలో జన్మించిన గుర్తుగా 1976లో దేవాలయాన్ని నిర్మించారు. నాటి నుంచి ఏటా దేవీ నవరాత్రుల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు జరుపుతున్నారు. ఇక్కడ భారీ శమీ చెట్టు దర్శనమిస్తుంది. మహిషాసురుడనే రాక్షసుడు మేరు పర్వతంపై బ్రహ్మదేవుడిని పూజించగా ఆయన ప్రత్యక్షమై వరం కోరుకోమని అడిగారు. మహిషాసురుడు తనకు మరణం లేకుండా చూడాలని కోరగా.. ప్రతి ప్రాణి మరణించాల్సిందేనని బ్రహ్మదేవుడు చెప్పడంతో అబల(స్త్రీ) చేతిలో చనిపోవాలని కోరుకుంటాడు. ఈక్రమంలో అమ్మవారు తొమ్మిది రోజులు అవతారమెత్తి చివరి రోజు మహిషాసుర మర్దని అవతారం ఎత్తి రాక్షసుడిని అంతం చేస్తుంది. దీనికి ప్రతీకగా ఆలయంలో విజయదశమి రోజు శమీ పూజ చేయటం ఆనవాయితీగా వస్తోంది.

అంతా రామమయం..!

భద్రాచలం, న్యూస్‌టుడే: అయోధ్య నగరం మనకెంతో ఆరాధ్య ప్రాంతం. మిథిలా నగరం సీతమ్మవారి స్వస్థలం. ఇది ప్రస్తుతం నేపాల్‌లో ఉంది. రావణుడు పాలించిన లంకా నగరం శ్రీలంకలో భాగమైంది. రామాయణంలో ఈ మూడు ప్రాంతాలకు ఎంతో విశిష్టత కలదు. ఈ మహాకావ్యంలో పూజ్యనీయులుగా సీతారాముల వారు ఉన్నారు. ఇలాంటి దేవదేవుడు సీతమ్మవారితో భద్రాచలం ప్రాంతంలో తిరుగాడారు. వనవాసం సమయంలో రాముడు సీతాదేవితో భద్రాచలంలో సేద తీరాడు. త్రేతాయుగంలో ఇక్కడ సంచరించి భద్రుడికి వరమిచ్చారు. ఈ వరం కారణంగా ఆతర్వాత కాలంలో భద్రాచలంలో సీతారామలక్ష్మణులు కొలువయ్యారు. కలియుగంలో భద్రాచలం మహాపుణ్యక్షేత్రంగా భక్తుల పూజలందుకుంటోంది. ఆధ్యాత్మికంగా దర్శనీయ ప్రాంతంగా గుర్తింపు పొందింది.



దర్శనీయం అనుబంధ ఆలయాలు

☆ రామాలయానికి గల అనుబంధ ఆలయాలు ప్రసిద్ధిగాంచాయి. స్థానిక రంగనాయకుల గుట్ట ఎంతో పవిత్రమైన ప్రాంతం. రామాలయానికి అతి సమీపంలో ఉంది. అక్కడ రాములవారి ఆరాధ్యదైవం రంగనాథ స్వామివారు కొలువయ్యాడు. ధ్యాన మందిరం ప్రాంతంలో పూర్వం రామదాసు నివాసం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. పాల్వంచ తహసీల్దారుగా విధులు నిర్వర్తించిన సమయంలో భార్య, కొడుకుతో ఇక్కడ కొన్నేళ్లపాటు ఉన్నట్లు నమ్ముతారు. ఇక్కడి నుంచి చూస్తే రామాలయం అందాలు మరింత సుందరంగా కనిపిస్తాయి.

☆ వంతెన నుంచి బయల్దేరి పుణ్యస్నానాలు చేయాలనుకునే వారికి కరకట్ట అందాలు ముచ్చట గొలుపుతున్నాయి. సాయం సంధ్య వేళ విద్యుద్దీపాల కాంతిలో కరకట్ట పైనుంచి గోదావరి ప్రవాహం చూస్తే ఎంతటి వారైనా దాసోహం కావాల్సిందే.

☆ రాములవారు ముఖ్య ఉత్సవాలకు రాజ వీధి గుండా తిరువీధి సేవలో పాల్గొంటారు. తిరువీధి సేవకు వచ్చి స్వామివారు తాతగుడిలో పూజలు అందుకోవడం సంప్రదాయంగా వస్తుంది. తాతగుడి సెంటర్‌లో గోవిందరాజ స్వామివారు కొలువయ్యారు. ఈ ఆలయం ఎంతో ప్రశాంతంగా ఉంటుంది.

అభయాంజనేయస్వామి ఆలయ దర్శనం

పర్ణశాల ఆలయం భద్రాచలం రామాలయానికి అనుబంధంగా ఉంది. భద్రాచలం నుంచి ఇది 35 కి.మీ. దూరం కలదు. వనవాసం సమయంలో సీతారాముల వారు నివాసం ఉన్న ప్రాంతం ఇది. సీతమ్మవారు నార చీరలు ఆరేసిన ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తాయి. సీతాదేవిని అపహరించిన చోట విగ్రహాలను ఏర్పాటు చేశారు.

సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర •వైరా

తుమ్మలను కలిసిన లారీ అసోసియేషన్ బాధ్యులు



మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో అసోసియేషన్ బాధ్యులు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలంటూ సత్తుపల్లి లారీ అసోసియేషన్ బాధ్యులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విన్నవించారు. భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలో శుక్రవారం మంత్రిని కలుసుకున్నారు. జేవీఆర్, కిష్టారం ఓసీలు ప్రైవేటు కంపెనీలకు నాణ్యమైన బొగ్గు ఇవ్వకపోవడంతో లారీలనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమకు బొగ్గు లోడింగ్ లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 700 లారీల యజమానులు అవస్థలు పడుతున్నామని, అసోసియేషన్ అధ్యక్షుడు రావి నాగేశ్వరరావు వివరించారు. కొండపల్లి రమేశ్‌రెడ్డి, షేక్ మౌలాలీ, ఖలీల్, దాసు, బాజీ, రవి తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లి: రామానగరంలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి



కల్లూరు పుల్లయ్య బంజర్ వీధిలో అన్నదానం ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చిత్రంలో మట్టా దయానంద్, చంద్రరావు



మధిర మండలం మడుపల్లిలో అమ్మవారి విగ్రహం ఎదుట పూజల్లో పాల్గొన్న కమల్‌రాజు



కారేపల్లిలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై రాజారామ్

మహిషాసురమర్దినిగా అమ్మవారు

దేవీ నవరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని మండపాల వద్ద అన్నదానాలు చేశారు. ఏన్కూరు, తల్లాడ, వైరా మండలాల్లో బతుకమ్మలతో మహిళలు సందడి చేశారు. – న్యూస్‌టుడే యంత్రాంగం



ఏన్కూరు: టీఎల్‌పేటలో పెద్ద సంఖ్యలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



తల్లాడ మండలం అన్నారుగూడెంలో...



అమెరికాలోని కొలంబస్ రాష్ట్రంలో..

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
సత్తుపల్లి : 93922 39905
మధిర : 98668 05652
వైరా : 76619 46938

లక్ష్యం పాఠశాల వీధిలో డ్రైనేజీ సరిగ్గా లేకపోవడంతో నీళ్లు నిలిచి ఇబ్బందిగా మారింది.
- కిన్నెర మహేశ్, వీఎంబంజర్

✔ పంచాయతీ సిబ్బందితో కాలువ తీయించి నీరు సరిగా వెళ్లేలా చూస్తాం.
- రవిప్రసాద్, కార్యదర్శి, పెనుబల్లి, న్యూస్‌టుడే

సమస్య: కల్లూరు ప్రభుత్వ వైద్యశాల నుంచి పాత బస్టాండు వరకు జాతీయ రహదారి పక్కన చెత్త పేరుకపోయింది. **- పాఠకుడు**

సమాధానం: ఆ ప్రాంతంలో సిబ్బంది సాయంతో చెత్త తొలగిస్తాం. **- నందిశెట్టి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి** కల్లూరు, న్యూస్‌టుడే

స్పందనకు వందనం

చింతకాని, న్యూస్‌టుడే: తిరుమలాపురం అడ్డరోడ్డు వద్ద ఉన్న బస్ షెల్టర్‌లో ప్రయాణికులు కూర్చునే వీల్లేకుండా ఉంచుతున్న ద్విచక్ర వాహనాలు, సైకిళ్లను ఎస్సై నాగుల్‌మీరా శుక్రవారం తొలగింపజేశారు. 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి సమస్యతేగా ఎస్సై స్పందించారు.

ఆదర్శంగా సిరిపురం: భట్టి

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: సౌర విద్యుత్తు ఏర్పాటుతో సిరిపురం ఆదర్శంగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. రైతులు, స్థానికులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికి, వ్యవసాయ పంపుసెట్‌లకు సౌర విద్యుత్ ఏర్పాటు చేశాక దీనిపై అధ్యయనానికి ఇతర రాష్ట్రాల మంత్రులు, అధికారులు గ్రామానికి బారులు దీరుతారన్నారు. అవసరాలుపోను మిగిలిన విద్యుత్ గ్రిడ్‌లకు అమ్మి అదనపు ఆదాయం పొందేలా సిరిపురం ఆదర్శంగా నిలువనుందన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లి, సిరిపురం మాత్రమే పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికకయ్యాయని గుర్తుచేశారు.

★ కృష్ణాపురం గ్రామంలో ఏర్పాటుచేసిన అమ్మవారి మండపం వద్ద శుక్రవారం భట్టి పూజలు నిర్వహించారు. సీనియర్ నాయకుడు కర్నాటి రామారావు ఇంటి వద్ద స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. సిరిపురం రామాలయంలో దుర్గాఅమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిశోర్, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, చీదిరాల వెంకటేశ్వర్లు, దుంపా వెంకటేశ్వరరెడ్డి, నిడమానూరు వంశీకృష్ణ, యన్నం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న భట్టివిక్రమార్క

ఎట్టకేలకు రోడ్డెక్కిన యంత్రం

ఈనాడు కథనానికి స్పందన

మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో దాదాపు 11 నెలలుగా వృథాగా పడిఉన్న స్వీపింగ్ మిషన్ (రోడ్డు ఊడ్చే యంత్రం) ఎట్టకేలకు శుక్రవారం పనిచేయటం ప్రారంభించింది. రూ.40 లక్షలకు పైగా ఖర్చుతో తీసుకొచ్చిన యంత్రం వర్షపు నీటిలో పడిఉన్న విషయాన్ని గత నెలలో 'ఈనాడు'లో చిత్రకథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు స్కిల్డ్ డ్రైవర్‌ను ఏర్పాటు చేసిన యంత్రాన్ని అందుబాటులో తీసుకొచ్చారు. – మధిర, న్యూస్‌టుడే



పంటల పరిశీలన: ముదిగొండ, న్యూస్‌టుడే: గోకినేపల్లిలో వరి, పత్తి, మిరప పంటలను జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య శుక్రవారం పరిశీలించారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ సాగులో అధిక దిగుబడులు సాధించాలని ఆయన సూచించారు. ఏఓ సరిత, ఏఈఓ మౌనిక పాల్గొన్నారు.

సరస్వతీ పుత్రులకు చేయూత

వైరా, న్యూస్‌టుడే: వైద్య విద్యలో సీటు సాధించి ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న దుద్దేపుడికి చెందిన వైద్య విద్యార్థిని హర్షితకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ రూ.50 వేల సాయాన్ని ప్రకటించారు. మొత్తాన్ని ఆయన అనుచరుడు శ్రీరామినేని భాస్కర్ శుక్రవారం విద్యార్థినికి అందజేశారు. కౌన్సిలర్ జి.సురేశ్, పూర్ణ, శ్రీధర్, జానీ, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

★ చదువులో ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు గ్రామానికి చెందిన ప్రవాసియుడు కొండబోలు సురేశ్ సాయం అందించారు. వైద్యవిద్యలో సీటుసాధించిన సత్తుపల్లికి చెందిన శివభార్గవికి రూ.35వేలు, దుద్దెపుడికి చెందిన హర్షితకు రూ.5వేలు, ట్రిపుల్‌ఐటీ చదువుతున్న సిరిపురానికి శివసాయికి రూ.15వేలు, గొల్లపూడికి చెందిన చాందినికి రూ.10 వేలు, ఇంజినీరింగ్ విద్యార్థిని ప్రణయ, నాగలక్ష్మికి రూ.5వేలు ప్రకటించారు. ఈ మొత్తాన్ని అడిషనల్ ఎస్పీ ఎ.నరేశ్‌కుమార్ చేతులమీదుగా శుక్రవారం అందించారు. మార్క్‌ఫెడ్ మాజీ ఉపాధ్యక్షుడు బొర్రా రాజశేఖర్, పుర అధ్యక్షుడు సూతకాని జైపాల్, ఉపాధ్యాయుడు జీవీ సూర్యప్రకాశ్‌రావు, కట్టా కృష్ణార్జున్‌రావు, ముళ్లపాటి సీతారాములు, మురళీకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి చెక్కు అందిస్తున్న శ్రీరామినేని భాస్కర్

'సరిహద్దులో నిఘా ఏర్పాటు చేసుకోవాలి'

కల్లూరు, న్యూస్‌టుడే: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సరిహద్దు ఏపీ నుంచి ధాన్యం రాకుండా నిఘా ఏర్పాటు చేసుకోవాలని తహసీల్దార్ సాంబశివుడు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఓ రూప, ఎంపీఓ సురేష్‌బాబు, సీఈఓలు, ఏఈఓలు, ఐకేపీ బాధ్యులు పాల్గొన్నారు.

కారేపల్లి, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అధికారులతో కారేపల్లిలో మండల ప్రత్యేక అధికారి నవీన్‌బాబు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఏ ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేయాలి, రైతుల సమస్యలపై చర్చించారు. తహసీల్దార్ సంపత్‌కుమార్, ఏవో అశోక్‌కుమార్, సీఈవో హనుమంతరావు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

కారేపల్లి, న్యూస్‌టుడే: కారేపల్లిలో 50 కుటుంబాలకు భారాస మైనార్టీ సెల్ జిల్లా నాయకుడు షేక్ గౌసుద్దీన్ శుక్రవారం చీరలు పంపిణీ చేశారు.

గోడపత్రిక ఆవిష్కరణ

కల్లూరు, న్యూస్‌టుడే: టీయూసీలో ఇఫ్టూ విలీనానికి సంబంధించిన గోడపత్రికను శుక్రవారం కల్లూరు పట్టణంలో నిర్వహించారు. ఇఫ్టూ జిల్లా నాయకుడు కె.పుల్లారావు మాట్లాడుతూ 20న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలీన సభను జయప్రదం చేయాలని కోరారు. హమాలీ సంఘం నాయకులు బి.సత్యం, యేసు, వెంకటి, రాంబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

18 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

బోనకల్లు, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం రాత్రి బోనకల్లు గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో పట్టుకున్నారు. వాహనాన్ని స్టేషన్‌కి తరలించి విచారణ జరపగా గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన పెంటుసాహెబ్ అనే వ్యక్తికి చెందిన బియ్యంగా తేలిందని ఎస్సై మధుబాబు తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పాత కక్షలను మనసులో ఉంచుకుని..

చింతకాని, న్యూస్‌టుడే: పాతర్లపాడుకు చెందిన పావనిని ఆమె బాబాయి తాళ్లూరి చంద్రమౌళి పాతకక్షలు దృష్టిలో ఉంచుకొని దాడిచేశాడు. ప్రశ్నించిన పావని తండ్రి వెంకటేశ్వర్లును ఇనుప రాడ్డుతో తలపగలగొట్టాడు. నిందితునిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

వృద్ధున్ని కాపాడిన ఆర్కే ఫౌండేషన్ సభ్యులు

మధిర గ్రామీణం: దెందుకూరు గ్రామంలో రైల్వే బ్రిడ్జి కింద ముళ్లపొదల్లో పడిఉన్న గుర్తుతెలియని వృద్ధుణ్ని ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ ఆధ్వర్యంలో రక్షించి, మధిర సివిల్ ఆసుపత్రికి తరలించారు.

బస్టాండ్ ప్రాంగణంలో వ్యక్తి మృతి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో తలదాచుకుంటున్న వ్యక్తి శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. సత్తుపల్లిలోని గాంధీనగర్‌కు చెందిన కోటేశ్వరరావు(38) మద్యానికి బానిసయ్యాడు. తల్లిదండ్రులు, ఇల్లు కూడా లేకపోవడంతో బస్టాండ్ ప్రాంగణంలోనే తలదాచుకుంటూ కూలి డబ్బులతో మద్యం తాగుతుండేవాడు. ఆరోగ్యం దెబ్బతిని మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని సీహెచ్‌సీకి తరలించి బంధువులకు సమాచారం ఇచ్చారు.

హుండీ చోరీ


ఎర్రుపాలెం: బనిగండ్లపాడులోని గిరి పుణ్యక్షేత్రంలో హుండీని గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి నగదు చోరీ చేశారు.

శతాధిక వృద్ధుడు మృతి



తల్లాడ, న్యూస్‌టుడే: బాలపేటలో శతాధిక వృద్ధుడు తొగరు లాలయ్య(100) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సాయుధ పోరాటంలో గడల సీతారామయ్య దళంలో కొరియర్‌గా పనిచేశారు. అనంతరం ఐదు దశాబ్దాల పాటు సీపీఎం ప్రజాసంఘాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, భారాస మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకటలాల్ నివాళి అర్పించారు.

ఈనాడు సినిమా



చిరంజీవి

విశ్వంభర రాకతో

అభిమానులు, సినీ ప్రియుల దసరా వేడుకల్లో 'విశ్వంభర' ఓ భాగం కానుంది. చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న 'విశ్వంభర' టీజర్ శనివారం విడుదలవుతోంది. 'అందరూ ఎదురు చూస్తున్న అతని రాక ఓ వేడుక' అంటూ ఈ విషయాన్ని చిత్రబృందం శుక్రవారం ప్రకటించింది. వశిష్ఠ దర్శకత్వంలో, యు.వి.క్రియేషన్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రమిది. త్రిష నాయికగా నటిస్తోన్న ఈ సినిమాని విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. విడుదల తేదీపై నేడు చిత్రబృందం స్పష్టతనిచ్చే అవకాశాలున్నాయి.



బాలకృష్ణ



ప్రభాస్



అల్లు అర్జున్



ఎన్టీఆర్



నాని

పరాజయం చెప్పే పాఠం విలువైనదైనా.. ప్రతిభను చాటి చెప్పి ప్రపంచం ముందు హీరోగా నిలబెట్టేది విజయమే. అందుకే జీవితంలో జయాపజయాలు సాధారణమే అయినా ప్రతి ఒక్కరూ విజయం వెంటే పరుగులు తీస్తుంటారు. అయితే ఇతర రంగాలతో పోల్చితే చిత్ర పరిశ్రమలో ఈ విజయాలే సినీ కెరీర్‌కు కీలకంగా నిలుస్తుంటాయి. సినిమా సినిమాకీ మార్కెట్ లెక్కలు పెంచుకుంటూ పోవాలంటే నిలకడగా విజయాల బాటలో పయనం సాగించాల్సిందే. అదే ఇటు తారలకు.. అటు చిత్రసీమకూ శ్రీరామరక్ష. ఇప్పుడిలా వరస విజయాలతో దూసుకుపోతూ తదుపరి చిత్రాల విషయంలో అంచనాల్ని అంతకంతకూ పెంచేస్తున్న హీరోలు తెలుగులో చాలా మందే కనిపిస్తున్నారు. విజయానికి ప్రతీకగా నిలిచే విజయ దశమి సందర్భంగా ఆ తారల చిత్ర విశేషాలివీ..!

అంచనాలు పెంచుతున్న విజయ మంత్రం

వరుస హిట్లతో జోరు చూపిస్తున్న తారలు

కథానాయకులు వరుస విజయాలతో జోరు చూపిస్తుంటే సినీప్రియుల్లోనూ.. మార్కెట్ వర్గాల్లోనూ ఓ నూతనోత్సాహం కనిపిస్తుంటుంది. కాకపోతే ఈ పరిశ్రమలో నిలకడగా జైత్ర యాత్ర సాగించడం కత్తిమీద సాము లాంటి వ్యవహారమే. అలాంటిది ఈ మధ్య కాలంలో అగ్ర కథానాయకుల నుంచి కుర్ర హీరోల వరకు పలువురు వరుస విజయాలతో బాక్సాఫీస్ ముందు జోరు చూపిస్తున్నారు. దీని కోసం వాళ్లు తెర వెనుక తమదైన రీతిలో శ్రమిస్తున్నారు. ఆలస్యమైనా సరే కథల ఎంపికలో ఆచితూచి అడుగులేయడం.. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లుగా కొత్తదనానికి ప్రాధాన్యత ఇవ్వడం.. అన్నీ చక్కగా కుదిరాకే ఆయా ప్రాజెక్ట్ కోసం రంగంలోకి దిగడం.. వాళ్లు చేస్తున్న పని. కథానాయకుడు నందమూరి బాలకృష్ణ గత నాలుగేళ్లుగా నిర్విరామంగా జైత్ర యాత్ర కొనసాగిస్తున్నారు. 'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి' సినిమాలతో హ్యాట్రిక్ విజయాలందుకున్న ఆయన.. భారీ వసూళ్లతో బాక్సాఫీస్‌కు ఫుల్ జోష్‌ను అందించారు. దీంతో ప్రస్తుతం ఆయన నుంచి రానున్న 'ఎన్‌బీకే 109' (వర్కింగ్ టైటిల్)పైనా అంచనాలు భారీగా పెరిగిపోయాయి. బాబీ దర్శకత్వంలో ముస్తాబవుతున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో బాలయ్య రెండు కోణాల్లో సాగే పాత్రలో కనువిందు చేయనున్నారు. 'బాహుబలి' విజయాల తర్వాత వరుస పరాజయాలతో సతమతమైన ప్రభాస్ గతేడాది 'సలార్: పార్ట్ 1 - సీజ్‌ఫైర్'తో తిరిగి హిట్ ట్రాక్ ఎక్కిన సంగతి తెలిసిందే. ఇది బాక్సాఫీస్ ముందు దాదాపు రూ.700కోట్ల వసూళ్లు సాధించి సత్తా చాటగా.. ఈ ఏడాది 'కల్కి 2898ఎ.డి'తో దాదాపు రూ.1150కోట్ల పైచిలుకు వసూళ్లు కొల్లగొట్టి గత రికార్డును తిరగరాశారు ప్రభాస్. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న 'రాజాసాబ్'పై అంచనాలు మరింత రెట్టింపయ్యాయి. మారుతి తెరకెక్కిస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ హారర్ థ్రిల్లర్‌తో ప్రభాస్ హ్యాట్రిక్ కొడతారా లేదా? తెలియాలంటే వచ్చే ఏడాది ఏప్రిల్ 10వరకు వేచి చూడక తప్పదు. ఈసారి దీన్ని పాన్ వరల్డ్ సినిమాగా విదేశీ భాషల్లోనూ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఇది వసూళ్ల పరంగా ఎలాంటి రికార్డులు అందుకుంటుందన్నది సినీప్రియుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

జైత్ర యాత్ర సాగనీ..

చిత్రసీమలో దశాబ్ద కాలం పాటు నిలకడగా జైత్ర యాత్ర సాగించడమన్నది అరుదుగా కనిపిస్తుంటుంది. ఇప్పుడలాంటి ఘనతకు అడుగు దూరంలో ఉన్నారు కథానాయకుడు ఎన్టీఆర్. 2015లో 'టెంపర్'తో మొదలైన తారక్ జైత్ర యాత్ర 'నాన్నకు ప్రేమతో', 'జై లవ కుశ', 'అరవింద సమేత..', 'ఆర్ఆర్ఆర్' విజయాలతో జోరుగా సాగిన సంగతి తెలిసిందే. ఇప్పుడాయన 'దేవర: పార్ట్ 1'తో మరోసారి బాక్సాఫీస్ ముందు జోరు చూపిస్తున్నారు. కొరటాల శివ తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా చిత్రం ప్రస్తుతం వసూళ్ల పరంగా రూ.500కోట్ల మైలురాయికి చేరువైంది. ఇక వచ్చే ఏడాది ఎన్టీఆర్ నుంచి 'వార్ 2' వచ్చే అవకాశముంది. హృతిక్‌తో కలిసి చేస్తున్న ఈ మల్టీస్టారర్‌పై ఇప్పటికే ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ భారీ అంచనాలేర్పడ్డాయి. ఇది కూడా విజయవంతమైతే దశాబ్ద కాలం పాటు నిర్విరామంగా జైత్ర యాత్ర సాగించిన హీరోగా నిలుస్తారు తారక్. రాశి కంటే వాశి ముఖ్యమని నమ్ముతూ.. ఆలస్యమైనా సరే సినిమాల విషయంలో జాగ్రత్తగా అడుగులేస్తూ వరుస విజయాలతో దూసుకెళ్తున్నారు కథానాయకుడు అల్లు అర్జున్. 'అల.. వైకుంఠపురములో'తో ఫ్లాప్‌లకు చెక్ చెప్పిన ఆయన ఆ తర్వాత 'పుష్ప: ది రైజ్'తో ఏకంగా జాతీయ స్థాయిలో సత్తా చాటారు. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న 'పుష్ప 2: ది రూల్'పై ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ భారీ అంచనాలేర్పడ్డాయి. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 6న థియేటర్లలోకి రానుంది. ఓవైపు సినిమాల విషయంలో వేగం చూపిస్తూనే.. మరోవైపు విజయాల పరంగానూ దూకుడు చూపిస్తున్నారు కథానాయకుడు నాని. గతేడాది 'దసరా', 'హాయ్ నాన్న' చిత్రాలతో వరుస విజయాలందుకున్న ఆయన.. ఈ ఏడాది 'సరిపోదా శనివారం'తో హ్యాట్రిక్ పూర్తి చేశారు. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న తదుపరి చిత్రాలపైనా అంచనాలు రెట్టింపయ్యాయి. ప్రస్తుతం ఆయన ఓవైపు 'హిట్ 3'ని పూర్తి చేస్తూనే.. మరోవైపు దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతోనూ ఓ కొత్త ప్రాజెక్ట్ పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. యువ హీరోలు అడివి శేష్, నవీన్ పొలిశెట్టి, సిద్ధు జొన్నలగడ్డ కూడా వరుస విజయాలతో దూసుకుపోతున్నారు.

సల్మాన్ తిరస్కరిస్తే.. షారుక్‌కు స్టార్‌డమ్

మరిన్ని విశేషాలు https://epaper.eenadu.netలో

బ్యాంకింగ్ సెక్టార్‌పై పూర్తి స్థాయి చిత్రం



వెంకీ అట్లూరి, నాగవంశీ

'లక్కీ భాస్కర్'గా దీపావళి బరిలో సందడి చేయనున్నారు దుల్కర్ సల్మాన్. ఆయన హీరోగా నటించిన ఈ బహుభాషా చిత్రాన్ని వెంకీ అట్లూరి తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. మీనాక్షి చౌదరి కథానాయిక. ఈ సినిమా ఈ నెల 31న విడుదల కానున్న నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. "నాకు తెలిసి ఇంత వరకు బ్యాంకింగ్ సెక్టార్‌పై పూర్తి స్థాయి చిత్రమేదీ రాలేదు. అందులో చాలా రకాల కుంభకోణాలు జరుగుతుంటాయి. ఈ సినిమా అదే నేపథ్యంతో ఉంటుంది. డబ్బు సంపాదనపై ఇష్టమున్న ప్రతి ఒక్కరికీ ఈ చిత్రం తప్పక నచ్చుతుంది" అన్నారు. "ఈ నెల 26, 27 తేదీల్లో ఆంధ్ర, తెలంగాణల్లో విడుదల ముందస్తు వేడుకలు నిర్వహించనున్నాం" అన్నారు నిర్మాత సూర్యదేవర నాగవంశీ.

శ్రుతి.. ది డెవిల్ ఈజ్ వెయిటింగ్!



శ్రుతి హాసన్

నవీన్ చంద్ర హీరోగా లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'లెవెన్'. అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మిస్తున్నారు. రేయా, శశాంక్, అభిరామి తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలో తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలో నటి శ్రుతిహాసన్ పాడిన "ది డెవిల్ ఈజ్ వెయిటింగ్" అనే గీతాన్ని హీరో కమల్ హాసన్ విడుదల చేశారు. ఈ పాటకు డి.ఇమ్మాన్ స్వరాలు సమకూర్చగా.. దర్శకుడు లోకేశ్ సాహిత్యమందించారు.

ఒక్క సెకను కూడా బోర్ కొట్టలేదంటున్నారు



వేణు, శ్రీను వైట్ల, గోపీచంద్, కావ్య

'విశ్వం'తో థియేటర్లలో సందడి చేస్తున్నారు గోపీచంద్. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని శ్రీను వైట్ల తెరకెక్కించిన సంగతి తెలిసిందే. వేణు దోనేపూడి, టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో గోపీచంద్ మాట్లాడుతూ.. "మేము ఏదైతే నమ్మి ఈ చిత్రం చేశామో దానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఇది కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం" అన్నారు. "ఈ చిత్ర కథను.. అందులోని వినోదాన్ని ప్రేక్షకులు గొప్పగా ఆదరిస్తున్నారు. సినిమా ఒక్క సెకను కూడా బోర్ కొట్టలేదని చెప్పడం ఆనందాన్నిస్తోంది" అన్నారు దర్శకుడు శ్రీను వైట్ల. ఈ కార్యక్రమంలో కావ్య, వేణు దోనేపూడి తదితరులు పాల్గొన్నారు.

వీరలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు



భద్రాచలం, న్యూస్‌టుడే: విజయదశమి మహోత్సవాలు భద్రాచలంలో కొనసాగుతున్నాయి. రామాలయం ప్రాంగణంలో రోజుకో రూపంలో అమ్మవారు సాక్షాత్కరిస్తున్నారు. అలంకారాల్లో ఎనిమిదో రోజైన శుక్రవారం వీరలక్ష్మి అమ్మవారు నయనానందభరితం చేశారు. ఈ రూపంలో అమ్మవారిని వీక్షించిన భక్తులు జైజై నీరాజనాలు పలికారు. అర్చకులు భక్తిశ్రద్ధలతో లక్ష్మీతాయారు కోవెలలో పూజలు చేసి ఉత్సవమూర్తులను వీరలక్ష్మిగా అలంకరించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చన జరిపారు. రామాయణ పారాయణం మంత్రముగ్ధులను చేసింది.

స్వర్ణ రూపంలో రాములోరి దర్శనం

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వర్ణ కవచాలంకారంలో దేవదేవుడు మెరిసిపోవటంతో భక్తులు మురిసిపోయారు. ఈ రూపంలో ఉన్న అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడికి అర్చకులు సుప్రభాతం పలికారు. క్షేత్ర విశిష్టతను ప్రవచించారు. వైష్ణవ సంప్రదాయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. సీతమ్మకు యోక్త్రధారణ, రామయ్యకు యజ్ఞోపవీత ధారణ జరిపారు. మాంగళ్య ధారణ రమణీయంగా నిలిచింది. తలంబ్రాల వేడుక అమితానందాన్ని పంచింది. దర్బారు సేవ తన్మయత్వాన్ని నింపింది. ప్రధాన ఆలయంతో పాటు అనుబంధంగా ఉన్న ఆంజనేయుణ్ని, లక్ష్మీతాయారు అమ్మవారిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

15న దాతలకు సన్మానం.. భద్రాచలం రామాలయానికి రూ.లక్ష పైబడి విరాళం అందించిన దాతలకు స్థానిక మారుతీ సదనంలో మంగళవారం సన్మానించనున్నారు. నేరుగా ఆలయానికి వచ్చిన దాతలకు దర్శనం కల్పించి ప్రత్యేక బస్సుల్లో మారుతీ సదనం వద్దకు తీసుకెళ్లనున్నారు. టీ, అల్పాహారం భోజనం ఉంటుంది. దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి వసతి సదుపాయం కల్పిస్తారు. సన్మానం తర్వాత స్వామివారి ప్రసాదంగా కండువా, జాకెట్ పీసు, రెండు లడ్డూలు, స్వామివారి చిత్రపటం అందించనున్నట్లు ఈఓ రమాదేవి తెలిపారు.

జమలాపురంలో మహిషాసురమర్దినిగా..



ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం తొమ్మిదో రోజుకు చేరాయి. దుర్గాదేవి అమ్మవారు భక్తులకు మహిషాసురమర్దిని అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రాంగణంలో దంపతులచే సామూహిక చండీ హోమం, పూర్ణాహుతి వేడుక జరిపారు. భక్తులు శ్రీవారిని, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయగా, అన్నపూర్ణ భవన్‌లో భక్తులకు అన్నదానం అందించారు. ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, పర్యవేక్షకురాలు కె.విజయకుమారి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస్‌శర్మ, మురళీమోహనశర్మ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వన్యప్రాణులు.. వారికి కన్నబిడ్డల్లెక్క!!



మనుషులు కనిపిస్తేనే కాదు, కాస్త అలికిడి వినిపిస్తేనే ఆ వన్యప్రాణులు ఆమడదూరం పరిగెడతాయి. కానీ, కొందరు అటవీ శాఖ సిబ్బందిని చూస్తే మాత్రం ఆప్యాయంగా దగ్గరకొస్తాయి. తమ విధుల్లో భాగంగానే పలువురు సంరక్షకులు వన్యప్రాణులను కన్నబిడ్డల్లా చూసే అరుదైన దృశ్యాలకు కిన్నెరసాని దుప్పుల పార్కు వేదికగా నిలుస్తుంది. ఇక్కడున్న కొమ్ముల దుప్పులు, మూషిక జింకలు, కొండగొర్రెల సంరక్షణ బాధ్యతలను ఆరుగురు సిబ్బంది చూస్తున్నారు. వీరిలో ఇద్దరు మహిళలు రోజూ పచ్చిక కోసి దుప్పులకు ఆహారంగా అందజేస్తారు. ఉదయం, సాయంత్రం క్వింటా దాణాను పిల్లలకు తినిపించినట్టు తినిపిస్తారు. పిల్ల దుప్పులు ఆ మహిళలను చూడగానే గెంతులెత్తుతూ దగ్గరకొచ్చే దృశ్యాలు సందర్శకులను ఎంతో ఆశ్చర్యపరుస్తుంటాయి.

'దుప్పులకు ప్రతిరోజూ ఆహారాన్ని అందిస్తాం. మమ్మల్ని చూస్తే చాలు.. పది అడుగుల దూరంలోంచే ఒక్క అడుగున వచ్చి దగ్గర వాలతాయి. ఓ ఐదారు వన్యప్రాణుల కడుపు నిండే వరకు అక్కడే గడుపుతాం. ఆకలి తీరగానే అవి మళ్లీ మందలోకి వెళ్లడాన్ని చూసి ఎంతో సంతోషమేస్తుంది. వాటిని చూస్తే ఇంట్లో మా పిల్లలు చుట్టూ తిరుగుతున్నారనే భావనే కలుగుతుంది. ఎప్పుడైనా అస్వస్థత కలిగితే మా ప్రాణం విలవిలలాడుతుంది' అని సిబ్బంది జ్యోతి, సభాన 'న్యూస్‌టుడే'తో అన్నారు.

– ఈనాడు, ఖమ్మం, పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే



సింగరేణి ఉజ్వల భవిష్యత్తుకు శ్రమించాలి: సీఎండీ



సదస్సులో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాంనాయక్


సత్తుపల్లి, న్యూస్‌టుడే: సింగరేణి సంస్థ ఉజ్వల భవిష్యత్తుకు కార్మికులు కలిసికట్టుగా కృషి చేయాలని సీఎండీ బలరాంనాయక్ కోరారు. శుక్రవారం రాత్రి స్థానిక జేవీఆర్ ఓసీలో 'ఉజ్వల సింగరేణి... ఉద్యోగుల పాత్ర'పై జీఎం షాలేంరాజు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. సీఎండీ మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి క్రమక్రమంగా తగ్గిపోతోందని, ఇంగ్లండ్‌లో పూర్తిగా ఆగిపోయిందన్నారు. సోలార్, బయోగ్యాస్ వంటి అనేక రకాల శక్తి వనరులు చొచ్చుక రావటంతో రాబోయే కాలంలో బొగ్గు వనరుకు ఇబ్బందులు తప్పవన్నారు. అందుకే ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. వందేళ్ల వరకు చెక్కు చెదరకుండా సింగరేణి మనుగడ సాగించాలని, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారని పేర్కొన్నారు. సోలార్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 5వేల మెగావాట్లకు తీసుకెళ్లేలా కృషి చేస్తున్నామన్నారు. సంక్షేమం, వైద్య విషయంలో కార్మికులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్మికులు కూడా అదే స్థాయిలో సంస్థ అభివృద్ధికి పాటుబడాలన్నారు. బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, లా, ఎంబీబీఎస్ చేసిన వారు కూడా కొలువు కోసం ప్రయత్నిస్తుండటం సింగరేణి గొప్పతనమే అన్నారు. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ సింగరేణిలో సమస్యలు తన దృష్టికి వచ్చాయని, పరిష్కారానికి ప్రయత్నిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ ప్రభావిత ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలని, ఓసీ కారణంగా దెబ్బతిన్న ఇళ్ల సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కోరారు. లారీ అసోసియేషన్‌కు లోడింగ్ పెంచాలన్నారు. డైరెక్టర్ సత్యనారాయణ, పీఓలు ప్రహ్లాద, నరసింహారావు, ఏఎంసీ ఛైర్మన్ దోమ ఆనంద్‌బాబు, పుర వైస్ ఛైర్‌పర్సన్ తోట సుజలారాణి, కౌన్సిలర్ కంటే నాగలక్ష్మి, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు రజాక్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాల్లో ఇద్దరి మృతి

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: మణుగూరులో గురువారం రాత్రి వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. తోగ్గూడెం గ్రామానికి చెందిన వాసం సీత(50) సద్దుల బతుకమ్మ ఆడేందుకు వెళ్తుండగా.. రహదారిని దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఆమెను ఢీకొంది. ఆమెకు ఐదుగురు పిల్లలు ఉన్నారు. మణుగూరు మండలం చిక్కుడుగుంట గ్రామంలో ట్రాలీ ఆటో అదుపుతప్పడంతో డ్రైవర్ ఉప్పాక సతీశ్(38) మృతి చెందాడు. సతీశ్ సొంతంగా వాటర్ ప్లాంట్ నడపడంతో పాటు ఆటోలో రవాణా చేస్తుంటారు. వాటర్ క్యాన్లతో ఉన్న ఆటోని నడపుతున్న క్రమంలో అదుపుతప్పి ప్రమాదానికి గురై గాయపడ్డారు. ఇరువురా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బీకేపీఎస్ఆర్ డివిజన్ ఏరియా కమిటీ సభ్యుడి అరెస్టు

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని పూసుగుప్ప-చర్ల మార్గంలో శుక్రవారం చేపట్టిన తనిఖీల్లో మావోయిస్టు పార్టీ బీకేఏఎస్ఆర్ డివిజన్ ఏరియా కమిటీ సభ్యుడు మడకం కోసయ్య అలియాస్ సుక్రామ్ (24)ని అరెస్టు చేసినట్లు ఎస్పీ బి.రోహిత్‌రాజు తెలిపారు. 5 కిలోల బరువున్న ఓ ల్యాండ్ మైన్‌ను ఆయన వద్ద స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. 'కోసయ్య మావోయిస్టు పార్టీలో మిలీషియా సభ్యుడిగా 2018లో చేరాడు. ఏడాది తర్వాత చర్ల ప్లాటూన్‌కు బదిలీఅయ్యాడు. మరో మూడేళ్లు అప్పాసి నారాయణ అలియాస్ రమేశ్ సంరక్షకుడిగా పనిచేశాడు. ఈ ఏడాది ఏసీఎంగా ప్రమోషన్ పొందాడు. భద్రతా బలగాలపై ప్రతీకారం తీర్చుకోవాలనే ఉద్దేశంతో చర్ల-పూసుగుప్ప మార్గంలోని లెనిన్‌కాలనీ శివారులో కల్వర్టుకు ల్యాండ్‌మైన్ అమర్చేందుకు శుక్రవారం వచ్చాడు. పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి అరెస్టు చేశాం' అని ఎస్పీ వెల్లడించారు. మరో ఇద్దరు నిందితులు పారిపోయినట్లు చెప్పారు. కోసయ్య 50కి పైగా హింసాత్మక ఘటనల్లో పాల్గొన్నాడని, ఈయనపై రూ.4లక్షల రివార్డు ఉందన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఈ వివరాలు తెలిపారు. ఓఎస్‌డి సాయిమనోహర్, మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్‌రెడ్డి, చర్ల సీఐ రాజువర్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ బి. రోహిత్‌రాజు

'ఉపాధ్యాయ రాజుల'దేవరపాడు

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: రాజులదేవరపాడు గ్రామానికి చెందిన 10మంది యువతీ, యువకులు డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. వారిలో వి.శ్రీనివాసరెడ్డి, వి.అప్పిరెడ్డి, వి.మధుసూదన్‌రెడ్డి, డి.కృష్ణవేణి, కె.కోటేశ్వరరావు, వి.రాధారుక్మిణి, ఎల్.తిరుపతిరెడ్డి, డి.గోపీకృష్ణ, పి.సాంబయ్య, పి.వెంకటనారాయణలు ఉన్నారు. వీరిని గ్రామస్థులు అభినందించారు.

ఖమ్మం
• ఖమ్మం • పాలేరు

'సమస్యలుంటే నా దృష్టికి తీసుకురండి'

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: ఆటో కార్మికులకు అండగా నిలుస్తూ సహాయ, సహకారాలు అందిస్తానని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తుమ్మల యుగంధర్ అన్నారు. ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఐఎన్‌టీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశంలో మాట్లాడారు. స్థానికంగా ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. యుగంధర్‌ను కార్మిక సంఘాల నాయకులు సత్కరించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు, నగర అధ్యక్షుడు నరాల నరేష్ మోహన్‌నాయుడు, ఆటో వర్కర్స్ యూనియన్ పార్లమెంట్ కమిటీ అధ్యక్షుడు పాల్వంచ కృష్ణ, కమర్తపు మురళి, మిక్కిలినేని నరేంద్ర, రావూరి సైదుబాబు, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎండీ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం అర్బన్ తహసీల్దారుగా కల్పనకు అదనపు బాధ్యతలు

ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే: ఖమ్మం అర్బన్ తహసీల్దారుగా కల్పన శుక్రవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు తహసీల్దారుగా పనిచేస్తున్న టి. స్వామిని సరెండర్ చేస్తూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. అర్బన్‌లో ఎన్నికల ఉప తహసీల్దారుగా పనిచేస్తున్న కల్పనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. తమకు ధ్రువపత్రాలు సకాలంలో ఇవ్వకపోవటంతో ఉద్యోగాలు కోల్పోయామంటూ తహసీల్దారుపై గత సోమవారం ప్రజావాణిలో ఓ మహిళ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి విలపించారు. ఈ సందర్భంగా తహసీల్దారును కలెక్టర్ పిలిచి మందలించిన విషయం విదితమే.

నియామకం

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం స్టీరింగ్ కమిటీ రాష్ట్ర ఛైర్మన్‌గా డాక్టర్ కె.వి.కృష్ణారావు రెండోసారి నియమితులైనట్లు కమిటీ శుక్రవారం ప్రకటించింది.

భిన్న అవతారాలు.. ప్రత్యేక పూజలు

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఖమ్మంలోని శ్రీస్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో అమ్మవారు ధనలక్ష్మీగా, గుట్టలబజారులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత శ్రీమహాకాళికా దేవిగా, ఖానాపురం హవేలి శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీమహిషాసురమర్దినిగా శుక్రవారం దర్శనమిచ్చారు. అమ్మవారి మండపాల్లో అన్నదానం చేశారు. మధురానగర్ శ్రీసద్గురు షిర్డీ సాయినాథ మందిరంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.



శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీమహాకాళికాదేవీ అవతారంలో అమ్మవారు



జమ్మిబండ వేదికపై పూజలు

మండపాల వద్ద అన్నదానం

నేలకొండపల్లి: కట్టుకాచారం, సుర్దేపల్లి, తిరుమలాయపాలెం మండలం కాకరవాయిలో, కూసుమంచిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత మండపాల వద్ద శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

PUBLIC NOTICE


నాక్లయింటు శ్రీమతి దేవరశెట్టి కళ్యాణి, W/o. నాగేశ్వరరావు, R/o. Flat No.103, స్నేహసాయి అపార్ట్‌మెంట్, జమ్మిబండరోడ్, ఖమ్మం. (సెల్ నెం. 8074595758) వారి సూచన మేరకు సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా!

ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఇంటిని శ్రీమతి **గెల్లా స్వప్న, W/o వేణుగోపాల్ గారు** Regd. Sale Deed No. 165/2019, Dt: 4-1-2019, SRO, Khammam ద్వారా క్రయం పొంది వారి సంపూర్ణ యాజమాన్య హక్కు భుక్తములో కలదు. అట్టి స్థిరాస్తిని కొనుగోలు చేయుటకు నాక్లయింటు మరియు గెల్లా స్వప్న గార్ల మధ్య మౌకికముగా ఒప్పందము జరిగినది. కావున సదరు విక్రయ విషయములో ఎవర్కైనా అభ్యంతరాలు ఉండిన యెడల ఈరోజు నుండి ఏడు (7) రోజులలోపు నాకు కానీ, నాక్లయింటుకు కానీ వ్రాతపూర్వకంగా తెలియజేయగలరు. గడువులోపు ఏ రకమయిన అభ్యంతరములు రానియెడల నాక్లయింటు సదరు విక్రయ విషయములో ఎవరికి ఏరకమైన అభ్యంతరములు లేవని భావించి విక్రయ దస్తావేజును రిజిస్టర్ చేయించుకొనగలరు. గడువు మీరిన పిదప వచ్చు అభ్యంతరములు నాక్లయింటును బద్దుని చేయవని ఇందుమూలముగా తెలియజేయుచున్నాను.

షెడ్యూల్: ఖమ్మం జిల్లా, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, జమ్మిబండ వీధిలో, ఆరోగ్య హాస్పిటల్ దగ్గర గల R.C.C. Roofed ఇల్లు H.No: 6-2-71/3/A2, 6-2-71/3/A3, **విస్తీర్ణం:** 163-33చ.గజములు గల ఇంటికి హద్దులు: **తూర్పు:** ముడుంబ ప్రమీల గారి ఇల్లు ఇంటి నెం: 6-2-71/3/1, **పడమర:** కొండుభట్ల వెంకట శివ అవధాని గారి ఇల్లు, **ఉత్తరం:** జ్యోతి ఎయిడ్ ఫండ్ సొసైటీ ఖమ్మం వారి స్థిరాస్తి, **దక్షిణం:** 30-0 అడుగుల వెడల్పు గల మునిసిపల్ కార్పొరేషన్ రోడ్డు.

Sd/- **P.B.SRI RAMULU** Advocate,
3rd Floor, Pullakhandam Towers, H.No: 9-11-86,
Kaman Bazar, Khammam, Cell: 9399323435

ఈనాడు సినిమా


చిరంజీవి

విశ్వంభర రాకతో

అభిమానులు, సినీ ప్రియుల దసరా వేడుకల్లో 'విశ్వంభర' ఓ భాగం కానుంది. చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న 'విశ్వంభర' టీజర్ శనివారం విడుదలవుతోంది. 'అందరూ ఎదురు చూస్తున్న అతని రాక ఓ వేడుక' అంటూ ఈ విషయాన్ని చిత్రబృందం శుక్రవారం ప్రకటించింది. వశిష్ఠ దర్శకత్వంలో, యు.వి.క్రియేషన్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రమిది. త్రిష నాయికగా నటిస్తోన్న ఈ సినిమాని విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. విడుదల తేదీపై నేడు చిత్రబృందం స్పష్టతనిచ్చే అవకాశాలున్నాయి.


బాలకృష్ణ


ప్రభాస్


అల్లు అర్జున్


ఎన్టీఆర్


నాని

అంచనాలు పెంచుతున్న విజయ మంత్రం

వరుస హిట్లతో జోరు చూపిస్తున్న తారలు

పరాజయం చెప్పే పాఠం విలువైనదైనా.. ప్రతిభను చాటి చెప్పి ప్రపంచం ముందు హీరోగా నిలబెట్టేది విజయమే. అందుకే జీవితంలో జయాపజయాలు సాధారణమే అయినా ప్రతి ఒక్కరూ విజయం వెంటే పరుగులు తీస్తుంటారు. అయితే ఇతర రంగాలతో పోల్చితే చిత్ర పరిశ్రమలో ఈ విజయాలే సినీ కెరీర్‌కు కీలకంగా నిలుస్తుంటాయి. సినిమా సినిమాకీ మార్కెట్ లెక్కలు పెంచుకుంటూ పోవాలంటే నిలకడగా విజయాల బాటలో పయనం సాగించాల్సిందే. అదే ఇటు తారలకు.. అటు చిత్రసీమకూ శ్రీరామరక్ష. ఇప్పుడిలా వరస విజయాలతో దూసుకుపోతూ తదుపరి చిత్రాల విషయంలో అంచనాల్ని అంతకంతకూ పెంచేస్తున్న హీరోలు తెలుగులో చాలా మందే కనిపిస్తున్నారు. విజయానికి ప్రతీకగా నిలిచే విజయ దశమి సందర్భంగా ఆ తారల చిత్ర విశేషాలివీ..!

కథానాయకులు వరుస విజయాలతో జోరు చూపిస్తుంటే సినీప్రియుల్లోనూ.. మార్కెట్ వర్గాల్లోనూ ఓ నూతనోత్సాహం కనిపిస్తుంటుంది. కాకపోతే ఈ పరిశ్రమలో నిలకడగా జైత్ర యాత్ర సాగించడం కత్తిమీద సాము లాంటి వ్యవహారమే. అలాంటిది ఈ మధ్య కాలంలో అగ్ర కథానాయకుల నుంచి కుర్ర హీరోల వరకు పలువురు వరుస విజయాలతో బాక్సాఫీస్ ముందు జోరు చూపిస్తున్నారు. దీని కోసం వాళ్లు తెర వెనుక తమదైన రీతిలో శ్రమిస్తున్నారు. ఆలస్యమైనా సరే కథల ఎంపికలో ఆచితూచి అడుగులేయడం.. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లుగా కొత్తదనానికి ప్రాధాన్యత ఇవ్వడం.. అన్నీ చక్కగా కుదిరాకే ఆయా ప్రాజెక్ట్ కోసం రంగంలోకి దిగడం.. వాళ్లు చేస్తున్న పని. కథానాయకుడు నందమూరి బాలకృష్ణ గత నాలుగేళ్లుగా నిర్విరామంగా జైత్ర యాత్ర కొనసాగిస్తున్నారు. 'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి' సినిమాలతో హ్యాట్రిక్ విజయాలందుకున్న ఆయన.. భారీ వసూళ్లతో బాక్సాఫీస్‌కు ఫుల్ జోష్‌ను అందించారు. దీంతో ప్రస్తుతం ఆయన నుంచి రానున్న 'ఎన్‌బీకే 109' (వర్కింగ్ టైటిల్)పైనా అంచనాలు భారీగా పెరిగిపోయాయి. బాబీ దర్శకత్వంలో ముస్తాబవుతున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో బాలయ్య రెండు కోణాల్లో సాగే పాత్రలో కనువిందు చేయనున్నారు. 'బాహుబలి' విజయాల తర్వాత వరుస పరాజయాలతో సతమతమైన ప్రభాస్ గతేడాది 'సలార్: పార్ట్ 1 - సీజ్‌ఫైర్'తో తిరిగి హిట్ ట్రాక్ ఎక్కిన సంగతి తెలిసిందే. ఇది బాక్సాఫీస్ ముందు దాదాపు రూ.700కోట్ల వసూళ్లు సాధించి సత్తా చాటగా.. ఈ ఏడాది 'కల్కి 2898ఎ.డి'తో దాదాపు రూ.1150కోట్ల పైచిలుకు వసూళ్లు కొల్లగొట్టి గత రికార్డును తిరగరాశారు ప్రభాస్. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న 'రాజాసాబ్'పై అంచనాలు మరింత రెట్టింపయ్యాయి. మారుతి తెరకెక్కిస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ హారర్ థ్రిల్లర్‌తో ప్రభాస్ హ్యాట్రిక్ కొడతారా లేదా? తెలియాలంటే వచ్చే ఏడాది ఏప్రిల్ 10వరకు వేచి చూడక తప్పదు. ఈసారి దీన్ని పాన్ వరల్డ్ సినిమాగా విదేశీ భాషల్లోనూ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఇది వసూళ్ల పరంగా ఎలాంటి రికార్డులు అందుకుంటుందన్నది సినీప్రియుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

జైత్ర యాత్ర సాగనీ..

చిత్రసీమలో దశాబ్ద కాలం పాటు నిలకడగా జైత్ర యాత్ర సాగించడమన్నది అరుదుగా కనిపిస్తుంటుంది. ఇప్పుడలాంటి ఘనతకు అడుగు దూరంలో ఉన్నారు కథానాయకుడు ఎన్టీఆర్. 2015లో 'టెంపర్'తో మొదలైన తారక్ జైత్ర యాత్ర 'నాన్నకు ప్రేమతో', 'జై లవ కుశ', 'అరవింద సమేత..', 'ఆర్ఆర్ఆర్' విజయాలతో జోరుగా సాగిన సంగతి తెలిసిందే. ఇప్పుడాయన 'దేవర: పార్ట్ 1'తో మరోసారి బాక్సాఫీస్ ముందు జోరు చూపిస్తున్నారు. కొరటాల శివ తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా చిత్రం ప్రస్తుతం వసూళ్ల పరంగా రూ.500కోట్ల మైలురాయికి చేరువైంది. ఇక వచ్చే ఏడాది ఎన్టీఆర్ నుంచి 'వార్ 2' వచ్చే అవకాశముంది. హృతిక్‌తో కలిసి చేస్తున్న ఈ మల్టీస్టారర్‌పై ఇప్పటికే ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ భారీ అంచనాలేర్పడ్డాయి. ఇది కూడా విజయవంతమైతే దశాబ్ద కాలం పాటు నిర్విరామంగా జైత్ర యాత్ర సాగించిన హీరోగా నిలుస్తారు తారక్. రాశి కంటే వాశి ముఖ్యమని నమ్ముతూ.. ఆలస్యమైనా సరే సినిమాల విషయంలో జాగ్రత్తగా అడుగులేస్తూ వరుస విజయాలతో దూసుకెళ్తున్నారు కథానాయకుడు అల్లు అర్జున్. 'అల.. వైకుంఠపురములో'తో ఫ్లాప్‌లకు చెక్ చెప్పిన ఆయన ఆ తర్వాత 'పుష్ప: ది రైజ్'తో ఏకంగా జాతీయ స్థాయిలో సత్తా చాటారు. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న 'పుష్ప 2: ది రూల్'పై ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ భారీ అంచనాలేర్పడ్డాయి. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 6న థియేటర్లలోకి రానుంది. ఓవైపు సినిమాల విషయంలో వేగం చూపిస్తూనే.. మరోవైపు విజయాల పరంగానూ దూకుడు చూపిస్తున్నారు కథానాయకుడు నాని. గతేడాది 'దసరా', 'హాయ్ నాన్న' చిత్రాలతో వరుస విజయాలందుకున్న ఆయన.. ఈ ఏడాది 'సరిపోదా శనివారం'తో హ్యాట్రిక్ పూర్తి చేశారు. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న తదుపరి చిత్రాలపైనా అంచనాలు రెట్టింపయ్యాయి. ప్రస్తుతం ఆయన ఓవైపు 'హిట్ 3'ని పూర్తి చేస్తూనే.. మరోవైపు దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతోనూ ఓ కొత్త ప్రాజెక్ట్ పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. యువ హీరోలు అడివి శేష్, నవీన్ పొలిశెట్టి, సిద్ధు జొన్నలగడ్డ కూడా వరుస విజయాలతో దూసుకుపోతున్నారు.

సల్మాన్ తిరస్కరిస్తే.. షారుక్‌కు స్టార్‌డమ్

మరిన్ని విశేషాలు https://epaper.eenadu.netలో

బ్యాంకింగ్ సెక్టార్‌పై పూర్తి స్థాయి చిత్రం


వెంకీ అట్లూరి, నాగవంశీ

'లక్కీ భాస్కర్'గా దీపావళి బరిలో సందడి చేయనున్నారు దుల్కర్ సల్మాన్. ఆయన హీరోగా నటించిన ఈ బహుభాషా చిత్రాన్ని వెంకీ అట్లూరి తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. మీనాక్షి చౌదరి కథానాయిక. ఈ సినిమా ఈ నెల 31న విడుదల కానున్న నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. "నాకు తెలిసి ఇంత వరకు బ్యాంకింగ్ సెక్టార్‌పై పూర్తి స్థాయి చిత్రమేదీ రాలేదు. అందులో చాలా రకాల కుంభకోణాలు జరుగుతుంటాయి. ఈ సినిమా అదే నేపథ్యంతో ఉంటుంది. డబ్బు సంపాదనపై ఇష్టమున్న ప్రతి ఒక్కరికీ ఈ చిత్రం తప్పక నచ్చుతుంది" అన్నారు. "ఈ నెల 26, 27 తేదీల్లో ఆంధ్ర, తెలంగాణల్లో విడుదల ముందస్తు వేడుకలు నిర్వహించనున్నాం" అన్నారు నిర్మాత సూర్యదేవర నాగవంశీ.

శ్రుతి.. ది డెవిల్ ఈజ్ వెయిటింగ్!


శ్రుతి హాసన్

నవీన్ చంద్ర హీరోగా లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'లెవెన్'. అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మిస్తున్నారు. రేయా, శశాంక్, అభిరామి తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలో తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలో నటి శ్రుతిహాసన్ పాడిన "ది డెవిల్ ఈజ్ వెయిటింగ్" అనే గీతాన్ని హీరో కమల్ హాసన్ విడుదల చేశారు. ఈ పాటకు డి.ఇమ్మాన్ స్వరాలు సమకూర్చగా.. దర్శకుడు లోకేశ్ సాహిత్యమందించారు.

ఒక్క సెకను కూడా బోర్ కొట్టలేదంటున్నారు


వేణు, శ్రీను వైట్ల, గోపీచంద్, కావ్య

'విశ్వం'తో థియేటర్లలో సందడి చేస్తున్నారు గోపీచంద్. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని శ్రీను వైట్ల తెరకెక్కించిన సంగతి తెలిసిందే. వేణు దోనేపూడి, టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో గోపీచంద్ మాట్లాడుతూ.. "మేము ఏదైతే నమ్మి ఈ చిత్రం చేశామో దానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఇది కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం" అన్నారు. "ఈ చిత్ర కథను.. అందులోని వినోదాన్ని ప్రేక్షకులు గొప్పగా ఆదరిస్తున్నారు. సినిమా ఒక్క సెకను కూడా బోర్ కొట్టలేదని చెప్పడం ఆనందాన్నిస్తోంది" అన్నారు దర్శకుడు శ్రీను వైట్ల. ఈ కార్యక్రమంలో కావ్య, వేణు దోనేపూడి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్తు సిబ్బంది బదిలీలపై నిషేధం

ఖమ్మం రోటరీనగర్, న్యూస్‌టుడే: టీజీఎస్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది బదిలీలపై శనివారం నుంచి నిషేధం విధిస్తూ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల చేపట్టిన బదిలీ ప్రక్రియపై ఆరోపణలు రావడంతో సీఎండీ ఈ ఉత్తర్వులు వెలువరించారు. శుక్రవారంలోపు బదిలీ ప్రక్రియ పూర్తిచేయాలని, 12 నుంచి నిషేధం అమల్లోకి వస్తుందన్నారు. బదిలీ అయిన ఉద్యోగులు మంగళవారం లోపు రిలీవ్ కావాలన్నారు. ఈ నేపథ్యంలో వివాదాలను పరిష్కరించేందుకు అధికారులు, నాయకులు ఖమ్మం సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి చర్చలు ప్రారంభించారు.

'భక్తరామదాసు' డ్రైరన్ విజయవంతం



కూసుమంచి, న్యూస్‌టుడే: భక్తరామదాసు ఎత్తిపోతల పథకం మోటారు డ్రైరన్ ప్రక్రియ విజయవంతమైంది. భారీ వర్షాల నేపథ్యంలో పాలేరు జలాశయానికి వరద పోటెత్తడంతో గత నెల 1న భక్తరామదాసు మోటార్లు నీట మునిగిన విషయం తెల్సిందే. రోజులపాటు మరమ్మతులు చేపట్టి అన్ని విభాగాల్లో తేమ లేకుండా చర్యలు తీసుకున్న నేపథ్యంలో శుక్రవారం డ్రైరన్ నిర్వహించారు. ఎలాంటి అవాంతరం ఎదురుకాలేదు. కొద్ది రోజుల్లో వెటరన్ నిర్వహిస్తామని డీఈఈ రమేశ్‌రెడ్డి తెలిపారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: కరోనా సమయంలో విశేష సేవలందించిన పారిశుద్ధ్య కార్మికులను ప్రముఖ వ్యాపారి గరికపాటి వెంకట్రావు శుక్రవారం సత్కరించారు. 35వ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు, రంగారావు పాల్గొన్నారు.

ఎట్టకేలకు కొలువు



ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: ఖమ్మం గ్రామీణ మండలం చింతపల్లి గ్రామానికి చెందిన బోగ మైబూ సుబాని ఎస్‌జీటీ ఉద్యోగం సాధించారు. 2017లో కొద్దిలో ఆమెకు ఉద్యోగం చేజారింది. భర్త ప్రైవేటు ఉద్యోగి. ఇంట్లో ఉంటూ కుటుంబ బాధ్యతలు మోస్తూనే పట్టుదలతో చదివి విజయం సాధించింది. ముందుగానే దసరా పండుగ వచ్చిందని మైబూ సుబాని సంతోషం వ్యక్తం చేశారు.

పండగ గిరాకీ..


పాలేరు సంతలో విక్రయానికి వచ్చిన జీవాలు

కూసుమంచి, న్యూస్‌టుడే: పండగ పూట మాంసాహారానికి ఉన్న ప్రాధాన్యం తెలిసిందే. పురవాసులు మాంసం విక్రయ దుకాణాల్లోనే కొనుగోలు చేస్తుంటారు.. గ్రామాల్లో మాత్రం రైతు కుటుంబాలు, పెద్ద కుటుంబాలు ఉమ్మడిగా జీవాలను తెచ్చుకొని తమ ఇళ్లలోనే మాంసంగానే మార్చుకునే ఆనవాయితీ కొనసాగుతోంది. దీంతో గ్రామాల్లో జీవాలకు (గొర్రె, మేక జాతి జంతువులు) గిరాకీ ఉంటోంది. జిల్లాలో రెండో అతి పెద్ద సంత అయిన కూసుమంచి మండలంలోని పాలేరులో శుక్రవారం జీవాల ధర బాగా పెరిగింది. ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లోని గ్రామీణులతోపాటు ఖమ్మం నగరం, సూర్యాపేట, కోదాడ పట్టణాల నుంచి మాంసం వ్యాపారులు పెద్ద సంఖ్యలో వచ్చి సంతలో జీవాలు కొనుగోలు చేశారు. దసరాకు ముందు రోజు సాగే గిరాకీని ముందే గ్రహించిన వ్యాపారులు, జీవాల పెంపకందారులు, రైతులు వందల సంఖ్యలో మేకలు, గొర్రెలను తీసుకొచ్చారు. ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. 380 జీవాల క్రయవిక్రయాలు సాగినట్లు సంత నిర్వాహకులు తెలిపారు. లోనికి రాకుండా వందల సంఖ్యలో బయట విక్రయాలు చేపట్టారు.



పండగ రోజుల్లో జీవాల ధరల పెంపు సహజమే. ఈసారి బాగా అధికమైంది. రైతులు కొంత వెసులుబాటుగా విక్రయించినా బయట ప్రాంతాల వ్యాపారులు అడ్డగోలుగా పెంచేశారు. రూ.8- 9 వేలలో లభ్యమయ్యే మేకను రూ.11వేలు వెచ్చించాల్సి వచ్చింది.

తేజావత్ పుల్లయ్య, అజయ్‌తండా, నేలకొండపల్లి

కాంగ్రెస్ కార్యకర్తలతో మంత్రి సుదీర్ఘ సమీక్ష


నేలకొండపల్లి మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన పొంగులేటి

కూసుమంచి, న్యూస్‌టుడే: గ్రామాల్లో చేపట్టాల్సిన, నిలిచిపోయిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతోపాటు, కాంగ్రెస్ కార్యకర్తల సమస్యలను తెలుసుకునేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. నేలకొండపల్లి మండల కార్యకర్తలతో మధ్యాహ్నం 12.30నుంచి రాత్రి 9గంటల వరకు క్యాంపు కార్యాలయంలో భేటీ అయ్యారు. గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల సమక్షంలో సమావేశం నిర్వహించారు. పార్టీ శ్రేణులు ప్రస్తావనకు తెచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు మంత్రి వెంటనే సంబంధిత అధికారులకు సూచనలిచ్చారు. సాధ్యాసాధ్యాలపై ఇరువర్గాలతో చర్చించారు. నేలకొండపల్లి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు వెన్నెపూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్ పాల్గొన్నారు.

అక్కాచెల్లెళ్లకు అభినందన

జీళ్లచెర్వుకు చెందిన అటవీ శాఖ ఉద్యోగి హరికృష్ణ కుమార్తెలు ప్రియాంక, ఉదయశ్రీలను మంత్రి పొంగులేటి శుక్రవారం అభినందించారు. హరికృష్ణ చిన్న కుమార్తె ఉదయశ్రీ కానిస్టేబుల్‌గా ఎంపికై మూడేళ్లుగా విధులు నిర్వహిస్తుండగా, పెద్ద కుమార్తె ప్రియాంక ఇటీవల ఎస్‌జీటీగా నియమితులైంది. మంత్రి వారిద్దరికీ శాలువాలు కప్పి అభినందించారు.

మంత్రి తుమ్మల పూజలు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఖమ్మం నగరంలోని రిక్కాబజార్ అంబా భవానీ ఆలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వడ్డెబోయిన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులు చెల్లించాల్సిందే..

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం యూపీహెచ్ కాలనీకి చెందిన ఫిర్యాదుదారుడు పుల్లిగొండ్ల ఉదయ్‌కుమార్‌కు వైద్య ఖర్చులు రూ.41,214 తోపాటు మానసిక వేదనకు గురైనందుకు రూ.10 వేలు, కేసు ఖర్చుల కింద రూ.10 వేలు మొత్తం రూ.61,214 కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ చెల్లించాలని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ శుక్రవారం తీర్పు చెప్పింది. కేసు వివరాల ప్రకారం. . పిటిషనర్ ఉదయ్‌కుమార్ కేర్ హెల్త్ బీమా కంపెనీ వద్ద 2022, జనవరి 25 నుంచి ఏడాదిపాటు ఆరోగ్య బీమా తీసుకున్నారు. 2022, సెప్టెంబరు 19న తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరి నాలుగు రోజులు చికిత్స పొందారు. తనకు అయిన వైద్యఖర్చులు రూ.41,214 చెల్లించాలని బీమా సంస్థను సంప్రదించడంతో వివిధ సాకులు చెప్పి తిరస్కరించారు. సేవాలోపంపై న్యాయవాది కె.యాకూబ్ ద్వారా జిల్లా వినియోగదారుల కోర్టులో కేసు దాఖలు చేశాడు. పిటిషనర్ సమర్పించిన పత్రాల్లో వైరుధ్యాలు ఉండడంతో క్లెయిమ్ తిరస్కరించామని బీమా కంపెనీ వాదనలు వినిపించింది. ఇరుపక్షాల వాదనలు విన్న కమిషన్ ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్ వి.లలిత, సభ్యురాలు వి.మాధవీలత బీమా కంపెనీ సేవాలోపాన్ని నిర్ధారించి రూ.61,214ను 45రోజుల్లో చెల్లించాలని ఆదేశించారు.

తపాలా కార్యాలయాల్లో బ్యాంకు ఖాతాలు తెరవాలి

ఖానాపురం హవేలి: ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల నమోదుకు కేంద్ర నూతన మార్గదర్శకాల ప్రకారం ఎస్సీ విద్యార్థులు తపాలా కార్యాలయాల్లో బ్యాంకు ఖాతాలు తెరవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఉప సంచాలకుడు కె.సత్యనారాయణ తెలిపారు. 'ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంకు' ద్వారా సేవింగ్స్ ఖాతాను అతి తక్కువ నగదు రూ.149తో తెరవచ్చని చెప్పారు.

మొబైల్ దుకాణంలో చోరీ

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: నేలకొండపల్లిలోని ఓ మొబైల్ దుకాణంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు షట్టర్లు తెరిచి రూ.70 వేల వస్తువులు దొంగలించారని దుకాణదారుడు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎస్సై సంతోష్ కేసు నమోదు చేశారు.

విద్యుత్తు సామగ్రి తస్కరణపై కేసు

కూసుమంచి, న్యూస్‌టుడే: మండలంలోని హిరామాన్ తండా, పెరికసింగారం విద్యుత్తు ఉపకేంద్రం నుంచి విద్యుత్తు సామగ్రి చోరీ ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. హిరామాన్ తండాలో ఇనుప స్తంభం ముక్కలు, నియంత్రిక యాంగ్లేర్, ఉపకేంద్రంలో నుంచి విద్యుత్తు తీగ చోరీ జరిగినట్లు ఏఈ వెంకన్న ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

హత్యకు కుట్రపై ఫిర్యాదు

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: తనను హత్య చేసేందుకు కుట్ర జరిగిందంటూ నగర కాంగ్రెస్ నాయకుడు మిక్కిలినేని నరేంద్ర ఖమ్మం టూటౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. తనను చంపేందుకు ఆంధ్రాకు చెందిన రౌడీషీటర్లకు సుపారీ ఇచ్చారంటూ నగరానికి చెందిన ఓ రౌడీషీటర్ ద్వారా తెలిసిందన్నారు. ఇందుకు సంబంధించిన ఆడియోను పోలీసులకు సమర్పించారు. విచారణ జరుపుతున్నామని ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు.

ముగ్గురు కీచక ఉద్యోగులపై కేసు

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: పవిత్రమైన వైద్యవృత్తిలో పనిచేస్తున్నా బుద్ధి మార్చుకోని ముగ్గురు కీచక ఉద్యోగులపై ఖమ్మం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ కథనం ప్రకారం... సర్వజనాసుపత్రిలోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో పీపీటీసీపీ కౌన్సెలర్‌గా మహిళా ఉద్యోగి పనిచేస్తున్నారు. సహ ఉద్యోగైన దొడ్డపునేని సురేశ్ పక్షం రోజుల క్రితం ఆమెకు ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడాడు. ఎల్టీ నున్నా శ్రీకాంత్, డీపీఎం సత్యకుమార్‌తో చనువుగా ఉంటున్నావని తెలిసిందన్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు షిటీమ్ పోలీసులు విచారణ జరిపారు. సురేశ్, శ్రీకాంత్, సత్యకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ వివరించారు.

బెదిరింపు ఘటనపై..

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: కత్తితో బెదిరించడంతోపాటు, దుకాణంలో అద్దం ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. బూడిదంపాడుకు చెందిన ఎం.గోపి అతని మిత్రులు మెడికల్ షాపులో ఉండగా అదే గ్రామానికి చెందిన రమేశ్ పాత కక్షల నేపథ్యంలో కత్తి చూపిస్తూ బెదిరించాడు. దుకాణంలో అద్దం ధ్వంసం చేశాడు. గోపి ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.